22న గానసభలో పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఆధ్వర్యంలో సినీసుస్వరాలు-64 తెలుగు, హిందీ సినీ గీతాలాపన, జాతిపిత మహాత్మాగాంధీ స్మార్తి పురస్కారాల ప్రదాన సభను ఈనెల 22న త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల నిర్వాహకులు బండారుసుబ్బారావు, బొక్కా భీమ్‌రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, 103 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు ఏటుకూరి కృష్ణమూర్తిలకు స్మార్తి పురస్కారాలను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బహూకరిస్తారని వివరించారు. గాయని ఆమని ఆధ్వర్యంలో గానవిభావరి ఉంటుందన్నారు.



అంబర్‌పేట బీసీ హాస్టల్‌లో యువకులతో సభ్యత్వం చేయిస్తున్న యశ్వంత్

అంబర్‌పేటలో బీజేపీ సభ్యత్వ నమోదు

అంబర్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.యశ్వంత్ ఆధ్వర్యంలో అంబర్‌పేట బీసీ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, యువకులకు పార్టీ సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రారావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకుడు దాసోజు నాగభూషణంచారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్‌పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. డిడి కాలనీ 11 కేవీ ఫీడర్‌పరిధిలోని రామచంద్ర డిగ్రీ కాలేజ్, గ్లాస్కో తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30, పటేల్‌నగర్ పరిధిలోని కృష్ణానగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో 12నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సికింద్రాబాద్/బేగంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోటా నీలిమ తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఆమె అన్నారు. ప్రాజెక్టు కేవలం సుందరీకరణకు మాత్రమే కాకుండా నది పునరుజ్జీవనాన్ని కూడా లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. నిరాశ్రయులైన పేదకుటుంబాల పునరావాసం కోసం 15 వేల డబుల్‌బెడ్ రూమ్ హౌజింగ్ యూనిట్లను కేటాయిస్తూ ఈనెల 16న తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని శుక్రవారం ఆమె స్వాగతించారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్‌రోడ్, మెట్రో విస్తరణ, ప్రపంచ స్థాయి స్టేడియాలు, నైపుణ్య విశ్వవిద్యాలయం తదితర ప్రధాన ప్రాజెక్టులతో హైదరాబాద్ నగరం ప్రపంచ పటంలో స్థానం పొందనున్నదని డాక్టర్ కోటా నీలిమ పేర్కొన్నారు.

వేర్వేరు రైలు ప్రమాదాలలో ఇద్దరు వ్యక్తులు మృతి

బర్కత్‌పుర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రైలు ప్రమాదంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. శుక్రవారం జామైఉస్మానియా - విద్యానగర్ రైల్వే స్టేషన్ల నడుమ 40 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో ఈ నెల 15న ఉప్పుగూడ - యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం



లక్ష్మీబాయి

సనత్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని మహిళ అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీబాయి(75) భర్త తులసీరామ్‌తో కలిసి ఉంటోంది. ఆమెకు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 13న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త తులసీరామ్ శుక్రవారం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఫ్రంట్‌లైన్ సిబ్బందికి వర్క్‌షాప్

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో అసాధారణ పరిస్థితుల్లో ప్రయాణికులను రక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై మౌలాలీలోని జోనల్ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. దక్షిణమధ్య రైల్వే క్లెయిమ్స్ బ్రాంచ్ కమర్షియల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో సుమారు 250 మంది స్టేషన్ మేనేజర్లు, లోకో పైలట్లు, రైలు మేనేజర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- కవాడిగూడలో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటర్‌వర్క్స్ ఎండీకి కార్పొరేటర్ వినతి



వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీనేతలు

కవాడిగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, మంచి నీటి, కలుషిత నీటి సమస్యను అరికట్టేందుకు పైప్‌లైన్ కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. శుక్రవారం కార్పొరేటర్ బీజేపీ నేతలు జివెంకటేష్, పరిమల్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, కేశవరాజుతో కలిసి ఆమె వాటర్‌వర్క్స్ ఎండీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రచనశ్రీ మాట్లాడుతూ, డివిజన్‌లోని కొత్త బజార్ మెయిన్‌రోడ్ నుంచి మజీద్ లైన్, శివాజీచౌక్, తాళ్లబస్తీ మల్లయ్య హోటల్, భాగ్యలక్ష్మినగర్, చిత్రాల నగర్ వరకు పురాతన పైప్‌లైన్ ఉండటం వల్ల నిత్యం రెండురోజులకోసారి డ్రైనేజీలు పొంగిపొర్లడం, మంచినీటి సరఫరాలో కలుషిత నీటి సరఫరాతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటర్‌వర్క్స్ ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పురాతన పైప్‌లైన్ పెరిగిన జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న పాటి వర్షం పడినా, ప్రతి రెండు రోజులకోసారి డ్రైనేజీలు నిండి రోడ్లపై మురుగునీరు ఏరులై పారుతోందన్నారు. ప్రస్తుతం పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకొని నూతన మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునికీకరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు. దీనికి వాటర్‌వర్క్స్ ఎండీ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

కల్లు గీత వృత్తిలో ఉపాధి పెంచే చర్యలు తీసుకోవాలి

- పలువురు వక్తల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

రాంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత వృత్తిలో ఉపాధి పెంచే చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణలో పదేళ్ల ప్రయాణం - కల్లు గీత వృత్తిలో ఉపాధి' అంశంపై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, టాడీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, వీరి జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు 22 అంశాలతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు భూపతి వెంకటేశ్వర్లు, సుప్రజ ఆస్పత్రి ఎండీ శిగ విజయ్‌కుమార్ గౌడ్, సంఘం సీనియర్ నాయకులు చింతల మల్లేష్‌గౌడ్, సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సదానందంగౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, అఖిల భారత గౌడ సంఘం వేములయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం తెలంగాణలో పదేళ్ల ప్రయాణం ఆల్బమ్‌ను అతిథులు ఆవిష్కరించారు.

వైభవంగా షిరిడీ సాయి సమాధి ఉత్సవాలు



సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రంగరాజ్‌గౌడ్, బీజేపీనేత మహేందర్‌బాబు, నిర్వాహకులు

కవాడిగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ షిరిడీ సాయిబాబా 40వ సమాధి ఉత్సవాలు కవాడిగూడ తాళ్లబస్తీలో అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని పలుప్రాంతాలతో పాటు చుట్టు పక్క ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై దర్శించుకుంటున్నారు. 12వ తేదీనుంచి మండపంలో సాయిబాబాను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సాయిబాబాపూజ, రెండోరోజు దునిపూజ, మూడవరోజు పుష్పార్చన, నాలుగవరోజు గౌరీ పూజ, ఐదవరోజు పల్లకి సేవ, ఆరవ రోజు ప్రత్యేక అభిషేకం, అన్నదానం, శుక్రవారం పాలు పంపిణీ, శనివారం పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ, ఆదివారం సాయిబాబా రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు ఆర్ మహేష్ తెలిపారు. శుక్రవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ హాజరై పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. శుక్రవారం పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు బాస్కర్, నగర కాంగ్రెస్ నేతలు రమేష్‌యాదవ్, జి సాయిబాబా, కిట్టు, రాముతోపాటు పలు పార్టీ నేతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించిన వారికి నిర్వాహకులు ఆర్ మహేష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ట్రెయినింగ్ సెంటర్ల పేరుతో ఉగ్రవాదులకు శిక్షణ

- రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏంచేస్తోంది: ఈటల



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రెయినింగ్ సెంటర్ల పేరుతో ఉన్మాదులకు శిక్షణ ఇస్తుంటే రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏం చేస్తున్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని ఎంపీ ఈటల సందర్శించారు. ఆలయంలో చండీహోమం నిర్వహించగా అమ్మవారికి సాక సమర్పించాలని పురోహితులు సూచించడడంతో మహిళలతో కలిసి ఎంపీ ఈటల అమ్మవారికి సాక సమర్పించారు. అనంతరం 31వ బస్టాప్ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి సాక సమర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈటల మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే ఉన్మాదులదాడిలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటి వరకు ఆరు ఆలయాలపై దాడులు జరిగినా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఆలయంలో దాడి చేసిన నిందితుడు ఆస్పత్రిలో బెడ్ మీద దర్జాగా పడుకుని ఈ పని అల్లా చేయించాడని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని అన్నారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే కేంద్రం రంగంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. శనివారం జరిగే సికింద్రాబాద్ బంద్‌కు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. అమ్మవారి విగ్రహం ధ్వంసం అనంతరం రెండెంచల భద్రతలో పోలీసులు కొంతమేర శుక్రవారం ఆంక్షలు సడలించారు. ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు చూసిన తరువాత ఆలయంలోకి అనుమతించారు.

'అడ్డగుట్ట'లో మహిళా భవన్ ఏర్పాటు చేయాలి

- రుద్రవీణా మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శోభ

అడ్డగుట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లో మహిళా భవన్ ఏర్పాటు చేయాలని రుద్రవీణా మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్. శోభ కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అడ్డగుట్టలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో శోభ మాట్లాడుతూ మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయానికి కొద్ది దూరంలో ఖాళీ స్థలం ఉన్నదని, మహిళా భవన్ కోసం స్థలం కేటాయించాలని గతంలో జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ అందజేయగా, వారు సర్వే కూడా చేశారని అన్నారు. అనంతరం గత ప్రభుత్వం ఆ విషయాన్ని మర్చిపోయిందని, ప్రస్తుత ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మహిళా భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అడ్డగుట్టలో దాదాపు 120 మహిళా సంఘాలు ఉన్నాయని, వారు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవనం లేక ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రి సీతక్కకు వివరించగా సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో సంఘం సభ్యురాళ్లు భాగ్యలక్ష్మి, జమున, మమత, లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ కన్వీనర్ డి. రామలీల ఉన్నారు.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీ.. పట్టించుకోని జలమండలి



రాజా డీలక్స్ చౌరస్తాలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో వాహనదారుల పాట్లు

రాంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ జలమండలి పరిధిలోని బాకారం మెయిన్ రోడ్డు నుంచి రాంనగర్ వెళ్లే మార్గంలో రాజాడీలక్స్, సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తాలో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. జలమండలి చేపట్టిన డ్రైనేజీ రహిత నగరం 90 రోజుల ప్రణాళిక అబాసుపాలయింది.

ఈ చౌరస్తాలో కొంత కాలంగా నిత్యం డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. దీంతో ప్రధాన రోడ్డు, చౌరస్తా ప్రాంతం మొత్తం మురుగునీరు పారుతూ పాదచారులు, వాహన దారులు, స్థానిక వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ సమీపంలోనే ఒకవైపు సాగర్‌లాల్ ఆస్పత్రికి చెందిన నర్సింగ్ కళాశాల, ఆస్పత్రి ఉంది. ఇందులో ఉండే విద్యార్థులు దుర్వాసనతో తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. మరో వైపు మెడికల్ షాపు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ షాపులకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ముషీరాబాద్ మెయిన్ రోడ్ నుంచి బాకారం మీదుగా రాంనగర్ వెళ్లాల్సిన వారు ఈ మురుగు నీటినుంచే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై జలమండలి, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు సుప్రియానవీన్ గౌడ్, కె.రవిచారిలకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పరిష్కరించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిటల్, నారాయణగూడ జీఎం రామకృష్ణలు స్పందించి రాజా డీలక్స్ చౌరస్తాలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించి జలమండలి చేపట్టిన డ్రైనేజీ రహిత నగరంగా మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికతతోపాటు సేవాభావం ఉండాలి: ముఠాగోపాల్



ముషీరాబాద్ మహంకాళి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఈవో మహేందర్ కుమార్

ముషీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత భావనతోపాటు ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ మహంకాళి దేవాలయం వద్ద అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహంకాళి దేవాలయానికి రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నదని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవో మహేందర్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, గౌరీ శంకర ఆలయ కమిటీ చైర్మన్ పి. శ్రీధర్‌చారి, పార్టీ సీనియర్ నాయకులు డి. శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, జి. రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం అంజయ్యకు నివాళి

ముషీరాబాద్, రాంనగర్, నల్లకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం టి.అంజయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ, టీపీసీసీ కార్యదర్శి జి.ఎస్.కేశవ్, నగర నాయకులు కన్నా డానియల్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనెడీ, నాయకులు నాగేంద్రప్రసాద్,సుధేష్ ట్యాంక్‌బండ్ వద్ద కార్యక్రమంలో పాల్గొన్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి డి.వెంకటేష్, పార్టీ రాష్ట్ర నాయకుడు కేశవ్, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్ వద్ద అంజయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, తదితరులు



టి.అంజయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్



లుంబినీ పార్కులోని అంజయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకులు

శాస్త్రీయనృత్యంతో ఎన్నో లాభాలు

- కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి



డా.ఆర్ ప్రసన్నరాణికి పురస్కారం బహూకరిస్తున్న వేణుగోపాలచారి

చిక్కడపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయనృత్యంతో ఎన్నో లాభాలున్నాయని కేంద్ర మాజీ మంత్రి ఎస్. వేణుగోపాలచారి అన్నారు. నాట్యం నేర్చుకున్నవారిలో ఐక్యూ ఎక్కువగా ఉంటుందన్నారు. నృత్యకిన్నెర ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో కూచిపూడి నాట్యగురువు వేదాంతం జగన్నాథశర్మ 42వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ నాట్య గురువు డా.ఆర్ ప్రసన్నరాణికి పురస్కారం ప్రదానసభ జరిగింది. వేణుగోపాలచారి పురస్కారం బహూకరించి మాట్లాడుతూ నేటి తరానికి శాస్త్రీయనృత్యంపట్ల ఆసక్తి పెంచేలా నాట్యంలో మార్పు తేవాలన్నారు. ఓలేటి పార్వతీశం, కిన్నెర రఘురామ్, ఉషాగాయత్రి, వోలేటి రంగమణి, రాజగోపాల్ పాల్గొన్నారు. తొలుత జగన్నాథశర్మ రూపకల్పన చేసిన నృత్యఅంశాలను వాసవి తదితరులు చక్కగా ప్రదర్శించారు.

వాల్మీకీనగర్‌లో కూలిన చెట్టు కొమ్మలు



కూలిన చెట్టుకొమ్మలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది

చిక్కడపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ వాల్మీకీనగర్ బస్తీ సమీపంలో ఉదయ్ సూర్య అపార్ట్‌మెంట్స్ వద్ద శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా భారీ చెట్టు కొమ్మలు రోడ్డుపై కూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకుని కొమ్మలను కట్ చేసి రోడ్డుకు అడ్డంగా పడ్డ శిథిలాలను తొలగించే పనులు చేపట్టారు. బీజేపీ నేతలు వినయ్ కుమార్, ఉమేష్, నర్సింహ, సాయికుమార్‌లు పనులను పర్యవేక్షించారు.

పత్తి క్వింటాల్‌కు రూ.15 వేల చొప్పున కొనుగోలు చేయాలి

- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం డిమాండ్

నల్లకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కనీసం క్వింటాలుకు ఎంఎస్‌పీ ధర చొప్పున కొనుగోలు చేసే దిక్కు లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నేతలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్వింటాల్‌కు రూ.15 వేల చొప్పున కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెచ్చెల రంగయ్య, పుప్పల ప్రభాకర్ మాట్లాడారు. ఖరీఫ్ సీజనల్‌లో అధిక వర్షాలతో పత్తి ఉత్పత్తి బాగా దెబ్బతిన్నదన్నారు. వ్యాపార వర్గాలు పత్తిని బినామీ పేర్లతో సీసీఐకి తీసుకెళ్తే ఎంఎస్‌పీ ధర చొప్పున కొనుగోలు చేసి వ్యాపారులకు తోడ్పడుతుందన్నారు. ఈ యేట ఎంఎస్‌పీ ధర కన్నా తక్కువగా రైతులు పత్తిని మార్కెట్‌లో రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు రైతులు ఇప్పటికే లక్షల క్వింటాళ్లు అమ్ముకున్నారని తెలిపారు.

బాగ్‌అంబర్‌పేట అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాలేరు



పాములబస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి తదితరులు

నల్లకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని పాముల బస్తీలో రూ. 5 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం నుంచి ఆంధ్రా బ్యాంకు చౌరస్తా వరకు రూ. 15 లక్షలతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, జలమండలి ఏఈ మాజీద్, ఎలక్ట్రిసిటీ ఏఈ సౌమ్య, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసులు

నల్లకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ చౌరస్తా నుంచి శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం వరకు రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలపై శుక్రవారం అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ రహదారిలో ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై డబ్బాలు, షెడ్‌ల వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ నెలకొంటుండంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు.

డ్రైనేజీలో వ్యర్థాల తొలగింపు



డ్రైనేజీ పైప్‌లైన్‌లో వ్యర్థాలను తొలగించే పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ఉమాదేవి

బర్కత్‌పుర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్‌లో పేరుకు పోయిన వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని చప్పల్‌బజార్, ఇందిరానగర్‌లో ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, మేనేజర్ వెంకటేష్‌యాదవ్, నాయకులు రమాదేవి, వెంకటేష్, బీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసేవారికే పదవులు

- బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్



శంకర్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసేవారికే అధిష్ఠానం పదవులను అప్పగిస్తుందని రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులుగా నియమితులైన శంకర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం శంకర్‌ముదిరాజ్‌ను భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, భోలక్‌పూర్ డివిజన్ మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రవీణ్ పాల్గొన్నారు.